క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

యద్దనపూడి: వైఎస్సార్ సీపీ యద్దనపూడి మండల నాయకుల, కార్యకర్తల సమావేశం సోమవారం సాయంత్రం 5 గంటలకు పర్చూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ రావూరి వేణుబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని అన్ని పంచాయితీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీల సమాచారం, అభివృద్ధి పనులు, పెండింగ్ అర్జీల వివరాలతో విధిగా హాజరు కావాలని సూచించారు.

కండక్టర్‌ని విధుల్లోకి తీసుకోవాలి

అద్దంకి: జంగారెడ్డి గూడెం డిపోకు చెందిన కండక్టర్ కుసుమ కుమారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అద్దంకి డిపోకు చెందిన ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. కుమార్, పి. తిరుపతిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కండక్టర్ డ్యూటీలో ఎదుర్కొంటున్న సమస్యలను చిన్న వీడియోలో పేర్కొన్న కారణంగా ఆమెకు డ్యూటీ కేటాయించకుండా ఉంచడం చట్టవిరుద్ధమన్నారు. రాజ్యాంగంలో కల్పించి ఆర్టికల్ 19 ప్రకారం తమ సమస్యలను తెలుపుకునే హక్కు ఉద్యోగులకు ఉందని తెలిపారు. ఆ డిపో మేనేజరు చర్యలు చట్ట వ్యతిరేకంగా ఉన్నాయని, ఆమెకు వెంటనే విధులు కేటాయించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

హైస్కూల్‌కు రెండు సీసీ కెమెరాలు

జె.పంగులూరు: మండల పరిధిలోని కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ సీసీ కెమెరాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్డమూడి వేణుబాబు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బుల్లిబాబు, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం కట్ట శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చీరాల టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి తోటవారిపాలెం పోలేరమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల పాలిట కొంగుబంగారంగా కొలువుదీరిన తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారిని వివిధ రకాల పూలు, నూతన వస్త్రాలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు చెల్లించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఆదివారం కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రూ. 45 కోట్లతో దేవాంగ సత్రం

వేటపాలెం: తిరుపతి పుణ్యక్షేత్రంలో శ్రీనివాస ఉమా రామలింగేశ్వర కమిటీ ఆధ్వర్యం లో రూ. 45 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన సత్రాన్ని అక్టోబర్ 4న ప్రారంభించనున్నారు. ఈమేరకు దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురంలో గల అనాథ వృద్ధ శరణాలయంలో సత్రం కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఉచిత అన్నదాన సత్రంతో పాటు 150 రూములు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సత్రం ప్రాంగణలోనే కల్యాణ మండపం ఉందన్నారు. పసుమర్తి మల్లికార్జునరావు, బొమ్మన దుర్గాప్రసాద్, ఊటుకూరి సుబ్రహ్మణ్యం, బంగారు ఆనంద్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కొప్పరపాడులో శివాలయం సమీపంలో నామ్ రహదారిలో వ్యర్థాల కుప్పలు



కుప్పలపై చల్లిన సున్నం, బ్లీచింగ్

కదలని మురుగు.. కుప్పలుగా వ్యర్థాలు

- సున్నం, బ్లీ చింగ్ చల్లి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- మొక్కుబడిగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర
- 17 నెలలుగా పంచాయతీలో విభేదాలు

బల్లికురవ: గ్రామపంచాయతీ పాలకమండలి మధ్య విభేదాలు 17 నెలలుగా పరిష్కారానికి నోచుకోవటం లేదు. ఫలితంగా గ్రామస్తులు మురుగు వ్యర్థాల కుప్పలు అసౌకర్యాలతో అనారోగ్యం బారిన పడుతున్నారు. మండలంలోని కొప్పరపాడు గ్రామ ఎస్సీ, బీసీ ఎస్టీ కాలనీలో ఐదువేల పైగా జనాభా నివసిస్తున్నారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన బందారు వెంకాయమ్మ సర్పంచ్‌గా ఉప సర్పంచ్ గా నాగినేని ప్రసన్నకుమారి 11 మంది వార్డు సభ్యులు బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యుల సహకారంతో మూడు సంవత్సరాల పాటు గ్రామ అభివృద్ధి బాగానే జరిగింది. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సర్పంచి, ఉప సర్పంచ్ మధ్య విభేదాలతో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచాయి. రూ. 20 లక్షల నిధులు మూలుగుతునాయి. అసంపూర్తి సైడ్ కాలవలు నిర్మాణం, కుప్పలు, కదలని మురుగు వల్ల దోమలు ఎక్కువై.. జ్వరాలు విజృంభిస్తున్నాయి.



స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ఇలా..

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం మమగానే ముగించారు. సర్పంచ్- ఉప సర్పంచ్ - వార్డు సభ్యుల మధ్య విభేదాలతో మండల స్థాయి అధికారిని సెక్రటరీ సచివాలయ అంగన్‌వాడీ సిబ్బంది 10 మందితో ర్యాలీ మమగా ముగించారు. వ్యర్థాల కుప్పలపై సున్నం బ్లీచింగ్ చల్లించి చేతులు దులుపుకున్నారు. సర్పంచ్ ఉప సర్పంచ్ 11 మంది వార్డు సభ్యులతో గ్రామ పంచాయతీ సమావేశం ఏర్పాటు చేసి అసౌకర్యాల నుంచి విముక్తితో అభివృద్ధికి బాటలు వేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.



ఎస్సీ కాలనీలో ముందుకు కదలని మురుగు

ఇసుక సమస్య పరిష్కరించండి

వేటపాలెం: ప్రభుత్వం ఇసుక ఉచితంగా తరలించుకోవచ్చని ఆదేశాలు ఇచ్చినప్పటికీ చీరాల నియోజకవర్గంలో అది అమలు కావడం లేదని ట్రాక్టర్ యజమానుల అసోసియేషన్ సభ్యుల పేర్కొన్నారు. ఆదివారం పందిళ్లపల్లిలో ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇసుక సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆందోళ చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ చీరాల నియోజకవర్గ పరిధిలో అన్ని ప్రాంతాల్లో ఇసుక విరివిగా లభిస్తుందన్నారు. గత 20 ఏళ్లగా ఇసుకను వివిధ పనుల కోసం ట్రాక్టర్స్ ద్వారా తరలించి దానిపై జీవనం సాగించి కుటుంబాలు గడుపు కోవడం జరుగుతుందని తెలిపారు. ఇసుక తరలింపుపై ఆధార పడి 150 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. అయితే ప్రస్తుతం ఏడాది కాలంగా ప్రభుత్వం ఇసుక ఉచితమని ప్రకటించినప్పటికీ అధికారులు ఇసుక తరలింపును అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్ ద్వారా తమ సొంత భూముల నుంచి ఇసుక తరలించుకుంటున్నప్పటికీ రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల ద్వారా అడ్డుకుంటున్నారన్నారు. దీనివల్ల కుటుంబాల జీవనాధారం కోల్పోయామన్నారు. ఇసుక సమస్యను ఉన్నత అధికారులు త్వరగా పరిష్కరించి ట్రాక్టర్ యజమానులు, ఇసుకపై ఆధార పడిన వారికి న్యాయం చేకూరే విధంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బి. రాజు, కోటేశ్వర రావు, కె. బ్రహ్మయ్య, పి. బుల్లోడు, ఆమంచి వాసు, కోలా స్వాములు, చంటి, హరిబాబు, శ్రీకాంత్, ఆర్. సాయి శ్రీకాంత్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

శరన్నవరాత్రుల పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

అద్దంకి: పట్టణంలోని కన్యాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి కార్యక్రమ పుస్తకానిన కార్యవర్గం ఆదివారం ఆవిష్కరించారు. దానిలో భాగంగా వచ్చే నెల 4న ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా సోమవారం 108 మంది మహిళలచే గుండ్లకమ్మ నుంచి 108 కలశాలతో నీటిని టీసుకువచ్చి అమ్మవారికి అభిషేకిస్తామని చెప్పారు. దేవస్థాన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం బెంజిమన్ హనూక్, ఉపాధ్యాయ సిబ్బంది

పర్చూరు(చినగంజాం): మండలంలోని చెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ చూపినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. ఉదయ్‌భాస్కర్ రెడ్డి తెలిపారు. పందిళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో చెరుకూరు జెడ్పీ పాఠశాల విద్యార్థి పి. మహేష్ 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, 200 మీ పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించాడు. అదే విధంగా చెస్ పోటీల్లో ఏ. డుండి సాయి గణేష్, 800 మీ పరుగు పందెంలో ఎస్. అనూష తృతీయ స్థానం సాధించారు. పాఠశాల హెచ్‌ఎం బెంజిమన్ హనూక్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

విజ్ఞానంతో వినోదం ఉండాలి

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు చిన్నతనం నుంచే విజ్ఞానంతో కూడిన వినోదాన్ని పెంపొందించుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కుర్రా రామారావు అన్నారు. ఆదివారం స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్‌ల సంయుక్త సహకారంతో 9,10 తరగతుల విద్యార్థులకు నేర్చుకుందాం.. ఆడుకుందాం..పాడుకుందాం కార్యక్రమంలో భాగంగా సైన్స్ ప్రయోగాలు, ఇంగ్లిషును సులభంగా నేర్చుకోవడం వంటి విషయాలపై తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో తెనాలికి చెందిన రిటైర్డ్ టీచర్ శివనాగేశ్వరరావు విద్యార్థులతో అనేకమైన సైన్స్ పరిశోధనలు చేయించారు. విద్యార్థులకు సులభంగా అర్థమవ్వడంతో పాటు, ఎక్సపర్‌మెంట్స్‌పై ఆసక్తి కలిగి ఉండేలా వారికి వివరించారు. శ్రీరాం శ్రీనివాసరావు ఇంగ్లిషు బోధలో మెళకువలను నేర్పించారు. కొత్తపేట ప్రధానోపాధ్యాయులు గుమ్మా శ్రీనివాసరావు గణితంను సులభంగా నేర్చుకోవడం ఎలా అంశంపై అవగాహన కల్పించారు. మహాకవి గురజాడ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పి. కొండయ్య, ఏడుకొండలు, హనుమంతరావు, ద్రాక్షారపు శ్రీనివాసరావు, సుబ్బారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



స్వర్ణ ఉన్నత పాఠశాలలో సైన్స్ బోధిస్తున్న శివనాగేశ్వరరావు

వైవీని కలిసిన అశోక్‌కుమార్

మేదరమెట్ల: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీభద్రారెడ్డిని అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ ఆదివారం ఒంగోలు వైవీ భద్రారెడ్డి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వైవీకి శాలువాను కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. వీరి వెంట రాష్ట్ర, మండల స్థాయి నాయకులు, నియోజకవర్గంలోని నాయకులు, పార్టీ శ్రేణులున్నారు.



వైవీభద్రారెడ్డికి శాలువా కప్పి మర్యాదపూర్వకంగా కలిసిన అద్దంకి ఇన్‌చార్జ్ అశోక్‌కుమార్

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు నివాళి

పర్చూరు(చినగంజాం): స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పేర్లి థామస్ (42) ఆదివారం మృతి చెందారు. పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు థామస్ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు కన్వీనర్ కఠారి అప్పారావు మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పంచాయతీ కార్యదర్శ మల్లా అంజమ్మ, కోట శ్రీనివాసరావు, యద్దనపూడి హరిప్రసాద్, జంగా అనిల్, వంశీ, తానికొండ రాజాలు, కూరాకుల భూషణం, పల్లెపోగు ఆధియ్య, కంచనపల్లి రమేష్, పేర్నిహరి, బోగాది రవి, పర్చూరు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పేర్లిథామస్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పార్టీ విజయం కోసం పనిచేయండి



మాట్లాడుతున్న గాదె మధుసూదన రెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): వ్యక్తిగత విభేదాలు పక్కన పెట్టి ప్రతి ఒక్కరూ పార్టీ విజయం కోసం పని చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి సూచించారు. పావులూలోని పార్టీ కార్యాలయంలో చినగంజాం మండల పార్టీ అధ్యక్షుడు మున్నం నాగేశ్వరరెడ్డి అధ్యక్షతన మండల నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ స్థాయి అధ్యక్షులు, బూత్ స్థాయి ఏజెంట్ల ఏర్పాటుపై ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించే దిశగా పార్టీపై నమ్మకాన్ని పెంచాలన్నారు. పాదర్తి ప్రకాష్, కొండూరి గోవింద్, ఎంవీ రామారావు, వై. తిరుపతి రావు, కుక్కల వెంకటేశ్వర్లు రెడ్డి, అక్కల రవీంద్ర రెడ్డి, ఎం. అంకిరెడ్డి, ఎం. సునీల్, బి. వెంకటరెడ్డి, కేవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

కార్మికవర్గ రాజ్య నిర్మాణం అవసరం

అద్దంకి: కార్మిక వర్గ రాజ్య నిర్మాణమే ప్రజా సమస్యల పరిష్కారానికి సంపూర్ణ మార్గమని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదిశగా రైతులు, వ్యవసాయ కార్మికులు గ్రామీణ శ్రామికులతో కలిసి సీఐటీయూ సారథ్యంలో కార్మిక వర్గం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలునిచ్చారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన అద్దంకి మండల మూడో మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘ సీనియర్ నాయకుడు పి. తిరుపతిరెడ్డి జెండా ఆవిష్కరించారు. గుంజి వెంకటరావు సభా ప్రాంగణంలో అలివేలు, తిరుపతి రెడ్డి అధ్యక్ష వర్గంగా గడిచిన మూడేళ్ళ కాలంలో ప్రజా ఉద్యమంలో మరణించిన అమరవీరులకు మహాసభ సంతాపం ప్రకటిస్తూ నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఉమామహేశ్వరావు మాట్లాడుతూ దేశంలో కోటిమంది సభ్యత్వంతో ఐక్య ఉద్యమాల సారథిగా సీఐటీయూ అగ్రస్థానంలో ఉందన్నారు. దేశ వ్యాప్తంగా గడిచిన మూడేళ్ళ కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, కార్మిక వర్గం ఎదుర్కొన్న సవాళ్ళ ను సమీక్షించుకోవాలన్నారు. కార్మికవర్గాన్ని కట్టు బానిసలుగా మార్చేందుకు వారి శ్రమను లూటీ చేసేందుకు పని గంటల సమయాన్ని ఎనిమిది గంటల నుంచి 13 గంటలకు పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు సరైన భద్రత లేదని ప్రతినిత్యం పసిపిల్లల నుంచి పండు ముసలి వరకు అఘాయిత్యాలకు గురవుతున్నా.. పట్టని నేటి ప్రభుత్వాలు రాత్రి వేళల్లో కూడా కార్మిక రంగంలో మహిళలు పనిచేయాలంటూ చట్టాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు గత మూడేళ్ల కార్మిక వర్గం నిర్వహించిన కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ మాట్లాడుతూ అద్దంకి ప్రాంతంలో వివిధ రంగాల్లో ఉన్న కార్మిక వర్గ స్థితిగతులను వివరించారు. ఈ నెల 27 28 తేదీల్లో రేపల్లెలో జరిగే సీఐటీయూ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆ తరువాత నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తంగిరాల వెంకటేశ్వర్లు కన్వీనర్‌గా, తిరుపతి రెడ్డి కో కన్వీనర్‌గా.. సామియేలు, ఆదాము, శారద, కోటేశ్వరమ్మ, బాష తదితరులతో కూడిన 12 మంది సభ్యులతో మహాసభ నూతన కమిటీని ఎన్నుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదాము, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ నాయకులు కేపీ రాజు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డీపీవీ సుబ్బారావు, ఫ్రూట్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు కోటేశ్వరరావు, మధ్యాహ్న భోజన కార్మికులు, మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ముగిసిన పెయింటింగ్, చిత్రలేఖనం శిక్షణ

అద్దంకి రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కలశం ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అద్దంకిలో నిర్వహించిన పెయింటింగ్, చిత్రలేఖనం శిక్షణతరగతులు ఆదివారంతో ముగిశాయి. 50 మంది విద్యార్థులు శిక్షణ తరగతులకు హాజయ్యారు. వీరందరికీ సర్టిఫికెట్లు, అవార్డులతోపాటు మెమెంటోలు ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశారు. కలశం ఫైన్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ అనూష పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

నేటి నుంచి దసరా శరన్నవరాత్రులు

అద్దంకి: ఆశ్వీజ మాస ప్రారంభంతోనే మొదలయ్యే శర్నవరాత్రులు, దేవీ నవరాత్రులుగా పేర్లున్న దసరా ఉత్సవం సోమవారం మొదలైంది. ఈ మాసంలో పాఢ్యమి మొదలు దశమి వరకు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇస్తుంది. పదో రోజైన విజయదశమిన పార్వేట ఉత్సవం నిర్వహిస్తారు. ఈ పండగను ఘనంగా జరుపుకునేందుకు, అద్దంకితో పాటు మండలంలోని శివాలయాలు, ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసిన మండలపాలు సిద్ధం అయ్యాయి. అద్దంకి పట్టణంలోని నగరేశ్వర, రామలింగేశ్వర, కమలేశ్వర, కన్యాకా పరమేశ్వరితోపాటు, ఐదు మండలాల్లోని 105 గ్రామాల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి.


చీరాల అర్బన్: శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయాలతో పాటు, భావనారుషి దేవాలయం, పేరాల శివాలయం, ఎంజీసీ మార్కెట్‌లోని అమ్మవారి దేవాలయం, శ్రీ కామాక్షి అమ్మవారి దేవాలయం తదితర దేవాలయాల్లో పూజలు జరగనున్నాయి. విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అమ్మవారి చిత్రపటంతో పట్టణంలో 108 కలశాలతో నగరోత్సవాన్ని నిర్వహించనున్నారు.

చినగంజాం: స్థానిక భావన్నారాయణ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వలివేటి శివ నారాయణ, వలివేటి వెంకట రామానుజం ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పలు కార్యక్రమాలు చేపడతామన్నారు.

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలోని చెరువు కట్ట మీద కొలువైన శ్రీ వైష్ణవీ దుర్గామాత ఆలయంలో సోమవారం నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

వేటపాలెం: పలు దేవస్థానాల్లో శరన్నవరాత్రోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా దేవస్థానాలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. సాయని లక్ష్మీనారాయణ, బాణాల ఉమామహేశ్వర రావు, సహకార్యదర్శి రంగిశెట్టి సాంబ శివరావు, అందే శ్రీనివాసరావు, పాగడదండ వెంకట రమణ పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): మండలంలోని నూతలపాడులో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో దసరా మహోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. పూజా కార్యక్రమాలు, గ్రామోత్సవం, నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.



అద్దంకి: దేవస్థానం వద్ద లైటింగ్



చీరాల: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి



కారంచేడులో అమ్మవారు



వేటపాలెం: సుందరంగా అలంకరించిన వేంకటేశ్వర దేవస్థానం



వేటపాలెం: ఉత్సవాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు



పర్చూరు: కార్యక్రమాలను వివరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

ఇంకొల్లు(చినగంజాం): సైబర్ మోసాలు పెరుగుతున్న తరుణంలో ప్రజలు చైతన్యవంతులై సైబర్ నేరగాళ్ళ వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఇంకొల్లు ఎస్ఐ జి. సురేష్ అన్నారు. ఆదివారం ఆయన తన సందేశం ద్వారా ప్రజలకు అవహగాహన కల్పిస్తూ సైబర్ మోసాలపై జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.